కాలువపై హామీలు... నీటి మూటలు

- ఫోర్ ఎల్ కాలువ నిర్మించేది ఎప్పుడు!
- మూడు గ్రామాల రైతుల ఎదురుచూపులు
- పూర్తయితే మూడు పంచాయతీల్లో పచ్చదనం
- 2500 ఎకరాలకు సాగునీరు



తురువోలు వద్ద 4ఎల్ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం



గతంలో అర్జునగిరిలో తవ్విన కాలువ ఆనవాళ్లు



అర్జునగిరిలో ఎండిన వరినారు (ఫైల్ ఫొటో)

చీడికాడ : కోనాం జలాశయం నుంచి ఇప్పటి వరకు నీరందని మూడు పంచాయతీలైన అర్జునగిరి, చెట్టుపల్లి, చుక్కపల్లిలకు సుమారు 2500 ఎకరాలకు సాగు, తాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన 4ఎల్ సబ్‌మైనర్ కాలువ నిర్మాణ పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యే అవకాశం కానరాలేదు. వివరాల్లోకి వెళితే... పై మూడు పంచాయతీల్లో వర్షాలు కురిస్తే పంటలు పండుతాయి. లేదంటే రైతులకు నష్టాలు, అప్పులే మిగులుతాయి. వేసవి రాకముందే ఆయా పంచాయతీ గ్రామాల్లో జనవరి నెల నాటికే చెరువులు ఎండి నేలలు నెర్రెలు విడుస్తాయి. ఈ నేపథ్యంలో 2002లో అప్పటి ప్రభుత్వం, విశాఖ డెయిరీ భాగస్వామ్యంతో పనికి ఆహార పథకంలో భాగంగా కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే అధికార పార్టీ నాయకులు కుటిల రాజకీయాలతో పనులకు అడ్డుపడ్డారు. దీంతో కాలువ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీనిని పూర్తి చేయాలని రైతుల కోరిన మీదట వై.ఎస్ హయాంలో మాడుగుల ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ 2009లో రూ.25 లక్షలు మంజూరు చేయించారు. అయితే ఆ నిధులు నిర్మాణానికి సరి పడవని కాంట్రాక్టర్లు ఎవరూ టెండర్ వేసేందుకు ముందుకు రాకపోవడంతో నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. గడిచిన ఇరవై రెండు ఏళ్లుగా కాలువ నిర్మించి ఆదుకోవాలని రైతులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెడుతూనే ఉన్నారు. ఈ సమస్యను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు 8 నెలల క్రితం విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన విశాఖ డెయిరీ నిధులతో కాలువను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఇంతలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం మారడంతో తిరిగి కాలువ నిర్మాణం బుట్ట దాఖలైంది. పలుమార్లు విశాఖ డెయిరీకి చెందిన ఇంజినీర్ల బృందం గతంలో తవ్విన కాలువను కూడా పరిశీలించారు. అయితే కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు పరిహారం చెల్లించాలంటూ రైతుల నుంచి డిమాండ్ వినిపిస్తుండడంతో ఈ కాలువ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎన్నికలప్పుడు నేతలు ఈ కాలువ నిర్మాణంపై హామీలిస్తూనే ఉన్నారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. దీంతో మూడు పంచాయతీల్లో వేల మంది రైతులకు సాగునీరు అందే స్థితి కానరాలేదు.

కాలువ వస్తే బతుకులు మారతాయి..



నా తాతల కాలం నుంచి ఏ ఏడాదిలో సాగు చేసినా ఏ పంట పూర్తిగా పండలేదు. ఇంటికి చేరలేదు. కాలువ వస్తుంది.. మా భూములు పండుతాయని గడిచిన పదేళ్లుగా ఎదురు చూపులే మిగులుతున్నాయి. ఈ కాలువ నిర్మాణం పూర్తి చేయాలని రైతులందరం కోరుకుంటున్నాం. వేసవి రాకముందే చెరువులు ఎండిపోతున్నాయి. పశువులకు గుక్కెడు నీరు కూడా దొరకడం కష్టమై పోతుంది. వేసవిలో ఊరిలో నించి కావిడతో నీళ్లు మోసుకెళుతుంటాం. ఈ కాలువ పూర్తయితే మా బతుకులు మారతాయి.

–పి.చెల్లంనాయుడు, రైతు, అర్జునగిరి

హామీలు ఉత్త మాటలేనా...



ఎన్నికల ముందు ప్రతి నాయకుడు ఈ మూడు గ్రామాల్లో 4ఎల్ కాలువ నిర్మాణం గురించి మాట్లాడతారు. ఎన్నికలైన తరువాత దాని ప్రస్తావన ఎత్తరు. మా భూములన్నీ వర్షం కురిస్తేనే పంటలు పండుతాయి. వర్షాకాలంలో సరిగా వర్షాలు కురవక పోతే ఆ ఏడాది తిండి గింజలు కొనుక్కోవాల్సి వస్తుంది. ఎంత ఖరీదైన పశువైనా వేసవి కాలం వచ్చిందంటే మేత దొరక్క నష్టాలకు అమ్ముకుంటూ అప్పుల పాలవుతున్నాం.

–పాతాళం చిన్నంనాయుడు, చెట్టుపల్లి

క్లుప్తంగా

శ్రమదానంతో తుప్పల తొలగింపు



రత్నంపేట, పనసలపాడు మార్గంలో శ్రమదానంతో తుప్పలు తొలగిస్తున్న స్థానికులు

రోలుగుంట : మండలం రత్నంపేట–పనసలపాడు మార్గంలో రోడ్డుకు ఇరు పక్కలా తుప్పలు , డొంకలు బలిసి ఎదురెదురుగా వచ్చే వాహనాలకు ప్రమాదకరంగా మారాయి. దీనిని బాగు చేసుకోవడానికి స్థానికులు నడుం బిగించి శ్రమదానంతో జంగిల్ క్లియిరెన్స్‌కు ఆదివారం శ్రీకారం చుట్టారు. కత్తులు పట్టుకొని దారి పొడవునా బలిసి ఉన్న తుప్పలు, డొంకలు నరికివేశారు. దీంతో రోడ్డుపై రాకపోకలకు వీలుగా పరిస్థితి మెరుగుపడింది. స్వచ్ఛందంగా తుప్పలు, డొంకలు తొలగింపు చేపట్టిన స్థానికులకు వాహనదారులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఇసుక తవ్వకాలను ఆపాలి



వరాహనదిలో ప్రాజెక్టు సమీపంలో ఇసుక తవ్వకాలు

మాకవరపాలెం : తాగునీటి ప్రాజెక్టు సమీపంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను ఆపాలని మండలంలోని గిడుతూరు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ గ్రామ సమీపంలో ఉన్న వరాహనదిలో మండలంలోని 18 గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూ.10 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు నిర్మించారు. అయితే కొద్ది రోజులుగా గ్రామంలోని టీడీపీ నేతలకు చెందిన ట్రాక్టర్లతో పగలు, రాత్రి వేళల్లో ఈ ప్రాజెక్టుకు దగ్గరలో ఇసుక తవ్వి తరలిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఈ ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయకుంటే తాగునీటికి ఇబ్బందులు తప్పవని, అధికారులు వెంటనే ఇసుక తవ్వకాలను ఆపాలని డిమాండ్ చేస్తున్నారు.

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం

మాడుగుల రూరల్ : ఈ నెల 22వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతుందని, ఎంపీడీఓ కె.అప్పారావు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో వీరనారాయణం, ఎల్.పొన్నవోలు, కె.జె.పురం -1 , సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్త ఆధార్ కార్డులు ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాల్లో నమోదు చేస్తారన్నారు.

26న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మాడుగుల రూరల్ : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26 వ తేదీన జరుగుతుందని స్థానిక ఎంపీడీవో కె. అప్పారావు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ఎంపీపీ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు అధికారులు హాజరుకావాలని కోరారు.

మెడిటేషన్ సెంటర్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పద్మావతి

నర్సీపట్నం : మున్సిపాలిటీ బలిఘట్టం బీసీ కాలనీలో రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు సతీమణి మున్సిపల్ కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి, జెడ్పీటీసీ రమణమ్మ ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడితో కూడిన జీవనాన్ని గడుపుతున్నారని, పర్మనెంట్ సెంటర్ ఏర్పాటుతో ఈ ప్రాంత వాసులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మానసిక ప్రశాంతత, ఒత్తిడిని అధిగమించేందుకు మెడిటేషన్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.సత్యనారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కింతలికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

మాడుగుల రూరల్ : మండలంలో కింతలి గ్రామంలో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కృషి మేరకు మంజూరు చేశారని, మండల దేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు ఆదివారం తెలిపారు. మండలంలో కింతలి, అవురువాడ, జాలంపల్లి, ఎల్.పొన్నవోలు, పొంగలిపాక, జేడీ పేట గ్రామాల పరిధిలో 40 గ్రామాలకు విద్యుత్ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. కింతలి గ్రామంలో రూ.3.37 కోట్ల వ్యయంతో 33 బై 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసినట్టు వారు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటు వల్ల 40 గ్రామాలకు విద్యుత్ సమస్య ఉండబోదని, లోవోల్టేజ్ సమస్య, తదితర సమస్యలు ఉండవని అన్నారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే బండారుకు ఈ ప్రాంత ప్రజల నుంచి కృతజ్ఞతలు తెలిపారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



మోదకొండమ్మను ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన 140 మంది భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు శిరస్సున పట్టుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఉచితంగా ప్రసాదం, తాగునీరు ఆలయ కమిటీ అందజేసింది.

నిరసన ర్యాలీని విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గబ్బాడ డిపోలో ఉన్న ఇసుకను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక ఉచితంగా ఇస్తామంటే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని, మాట నిలుపుకోకుండా టన్నుకు రూ.1165 ధర నిర్ణయించడం దారుణమన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టామన్నారు. నాలుగు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు విచ్చేసి ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇసుక కొరత తీవ్రంగా ఉందన్నారు. ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పి ఇసుకకు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. గబ్బాడ ఇసుక పాయింట్‌లో ఉన్న ఇసుకను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టామన్నారు.

పాల ధర తగ్గింపుపై రైతుల ఆగ్రహం



దండిసురవరంలో నిరసన తెలుపుతున్న రైతులు



విజయరామరాజుపేట పాలకేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

బుచ్చెయ్యపేట : తగ్గించిన పాల ధరను వెంటనే పెంచి ఆదుకోవాలని ఆదివారం విజయరామరాజుపేట పాల కేంద్రం వద్ద పలువురు రైతులు నిరసన తెలిపారు. ఒక పక్క తవుడు ఇతర పశు దాణా రేట్లు పెరిగి పశు పోషణ భారంగా మారగా గతంలో ఇచ్చిన ధరను 4 రూపాయల వరకు తగ్గించడం అన్యాయమని రైతులు ఆవేదన చెందుతున్నారు. పాల కేంద్రాల వద్ద , డెయిరీ పార్లర్ల వద్ద పాలు, పెరుగు, ఇతర పాల పదార్థాల ధరలను అధికంగా అమ్ముతున్నా పాలు పోసే రైతుకు మాత్రం ధరను తగ్గించి మా నడ్డి విరుస్తున్నారని రైతులు వాపోయారు. తగ్గించిన ధరను వెంటనే పెంచి ఆదుకోవాలని పాడి రైతులు ఎల్లపు గోవింద, కోరుబిల్లి రాజునాయుడు, కర్రి అప్పారావు, మళ్ల శ్రీను తదితరులు కోరారు.

చీడికాడ : విశాఖ డెయిరీలో తగ్గించిన ఆవు పాల సేకరణ ధరలు పెంచాలని రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం మండలంలోని దండిసురవరం గ్రామానికి చెందిన రైతులు పాలకేంద్రం ఎదుట నిరసన తెలిపారు. టీడీపీ అధికార ప్రతినిధి బొబ్బాది తాతారావు, టీడీపీ నేత వేపాడనాగేశ్వరరావు మాట్లాడుతూ ఆవుపాలు వెన్నశాతం 10 వస్తే లీటర్‌కు రూ.40 అందించే వారన్నారు. ప్రస్తుతం లీటర్‌కు రూపాయి తగ్గించి రూ.39 అందిస్తున్నారన్నారు. తగ్గించిన పాల ధరను తిరిగి పెంచాలని లేకుంటే రైతులతో కలసి విశాఖ డెయిరీని ముట్టడిస్తామన్నారు.

మామిడిలో అంతర పంటగా నువ్వు సాగు



సూదివలసలో అంతర పంటగా సాగులో ఉన్న నువ్వు పంట

కె.కోటపాడు : అంతర పంటల సాగు విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మామిడి పంటలను సాగుచేస్తున్న మెట్ట ప్రాంత గ్రామాల్లో గల రైతులు ప్రస్తుతం ఇప్పటికీ మామిడి పంటలో అంతర పంటగా నువ్వు పంటను సాగు చేస్తున్నారు. మొక్కదశలో ఉన్న మామిడి తోటల గల మధ్య గల ఖాళీ ప్రాంతంలో నువ్వు పంటను సాగు చేస్తున్నారు. మామిడిలో అంతర పంటగా నువ్వు సాగును చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం , కొరువాడ, కె.కె.అగ్రహారం, సూదివలస గ్రామాల్లో సాగు చేస్తున్నారు. మామిడి పూతదశకు చేరుకున్న సమయంలో నువ్వు పంట కోత దశకు చేరుకుంటుందని సాగు రైతులు పేర్కొంటున్నారు. అంతర పంటల వల్ల సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపనలు



కాశీపురంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ రమేష్, ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి : మండలంలోని వాలాబు, దేవరాపల్లి, కాశీపురం, నాగయ్యపేట గ్రామాలలో ఆదివారం పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాశీపురం, దేవరాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎంపీ సీఎం రమేష్ పాల్గొన్నారు. దేవరాపల్లిలో రూ.54.20 లక్షలు, కాశీపురంలో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులకు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన చేశారు. వాలాబు పంచాయతీ పరిధిలో సుమారు రూ.9.03 కోట్లతోను, నాగయ్యపేటలో రూ.73.33 లక్షల వ్యయంతో రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన చేశారు. డిసెంబర్‌లోగా పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, మండల పార్టీ అధ్యక్షుడు సూర్యనారాయణ, సర్పంచ్‌లు కర్రి పుష్ప, పెంటమ్మ, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, ఎంపీడీవో సువర్ణరాజు, తహసీల్దార్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేడు మండలంలో స్పీకర్ పర్యటన

నాతవరం : పెదగొలుగొండపేట పంచాయతీలో సోమవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పర్యటిస్తారని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తెలిపారు. పెదగొలుగొండపేట నుంచి వెదురుపల్లి గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారన్నారు. అదే విధంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారని ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేసి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ



ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రాజకీయ ప్రతినిధులు, అధికారులు

నర్సీపట్నం : ఇటీవల మరణించిన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నియోజకవర్గ కన్వీనర్ బొట్టా నాగరాజు, ఎంఈవో తలుపులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగరాజు మాట్లాడుతూ సాయిబాబా అంగవైకల్యంతో చక్రాల కుర్చీకే పరిమితమైనా చేయని నేరానికి పదేళ్ల జైలు జీవితం అనుభవించారన్నారు. కన్నతల్లి కడచూపుకు నోచుకోలేదన్నారు. మొక్కవోని ధైర్యంతో నిర్దోషిగా బయటకు రావడానికి ప్రొఫెసర్ సాయిబాబా కనబరిచిన పోరాట పటిమ ఎంతో గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీ యూనియన్ నాయకులు చిట్టియ్య, అప్పలనాయుడు పాల్గొన్నారు.

అధిక మోతాదులో నత్రజని వాడడం హానికరం

మాడుగుల రూరల్ : ఖరీఫ్ వరి పంటకు అధిక మోతాదులో నత్రజని వాడడం హానికరమని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు అన్నారు. వరి పంటలో సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వరి పంటకు పాముపొడ తెగులు అధికంగా ఆశించడంతో పాటు అగ్గి తెగులు సోకిందని, దీనివల్ల నత్రజని ఎరువులు వాడకూడదని, తెగులు పూర్తిగా తగ్గుముఖం పట్టిన తర్వాత మాత్రమే నత్రజని ఎరువు వాడాలని రైతులకు సూచించారు. వరి పంట చిరుపొట్ట దశకు చేరుకున్న తర్వాత ఒక ఎకరానికి 25 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను మితంగా ఉపయోగించుకోవాలని సూచించారు.

రేపు వైబీ పట్నంలో గ్రామసభ

రోలుగుంట : వై.బి.పట్నంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించనున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు తెలిపారు. ఇక్కడ కమ్యూనిటీ హాలు వద్ద నిర్వహించనున్న ఈ సభకు గతంలో జరిగిన భూ సర్వేలో ఏ విధమైన లోపాలున్నా రైతులు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చుకొని పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పెరిగిన శారదా నది నీటి మట్టం

కశింకోట: శారదా నది నీటి మట్టం ఆదివారం పెరిగింది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు నది పొంగి ప్రవహిస్తోంది. దీంతో స్థానిక గవరపేట ప్రాంతంలో పొలాలకు రాకపోకలు సాగించడానికి వినియోగించే దోనెలపై పరిమితంగా నదిని దాటిస్తుండటంతో తమ నిత్య కార్యకలాపాలకు అవరోధం కలగడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

రేపు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడి రాక

అనకాపల్లి: ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఈనెల 22న జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు కమిషన్ ప్రధాన కార్యాలయం కార్యదర్శి ఎన్.పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 రాత్రి 10 గంటలకు మంగళగిరి నుంచి రోడ్డు మార్గాన అనకాపల్లికి చేరుకుంటారని, 22 ఉదయం 11 గంటలకు కలెక్టర్ విజయ కృష్ణన్‌తో సమావేశం ఉంటుందన్నారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించి సమావేశం, అనంతరం ఎస్పీ కార్యాలయంలో పోక్సో కేసులు, బాల్య వివాహాల నివారణపై నేటి వరకూ తీసుకున్న జాగ్రత్తలపై చర్చిస్తారని ఆమె తెలిపారు.

వృథాగా పోతున్న తాగునీరు

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల పంచాయతీ చిన్నబాబు కాలనీ, జిల్లా ఉద్యానశాఖ కార్యాలయం సమీపంలో వాటర్ హెడ్ పంప్ నుంచి నిత్యం వేలాది లీటర్ల తాగునీరు రహదారిపై వృథాగా పోతున్నప్పటికీ పంచాయతీరాజ్ తాగునీటి విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి మీదుగా చోడవరం నుంచి అనకాపల్లికి నిత్యం వివిధ శాఖల అధికారులు రాకపోకలు సాగిస్తారు. తాగునీరు వృథాగా పోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పెరిగిన తుప్పలతో తప్పని ఇబ్బందులు



కోడూరు-సుభద్రయ్యపాలెం రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు

మాకవరపాలెం : రోడ్లకిరువైపులా పెరిగిపోయిన తుప్పలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని బూరుగుపాలెం వెళ్లే రోడ్డులో పైడిపాల, పెద్దిపాలెం వద్ద, జి.కోడూరు నుంచి సుభద్రయ్యపాలెం, మాకవరపాలెం నుంచి పి.పి.అగ్రహారం, జంగాలపల్లి వేళ్లే రోడ్లు జంగిల్‌తో దర్శనమిస్తున్నాయి. అసలే ఇవి చిన్న రోడ్లు కావడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఈ జంగిల్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హామీలు ఎప్పుడు నెరవేరుస్తారు...!

- విద్యుత్ ఛార్జీలు పెంచితే ఉద్యమం తప్పదు
- చినకోనాంలో ప్రజలతో కలిసి సీఐటీయూ నిరసన



చిన కోనాంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

చీడికాడ : విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపితే ఉద్యమం తప్పదని సీఐటీయూ మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని చినకోనాంలో ప్రజలతో కూడి పెంచిన విద్యుత్ చార్జీలు, నెరవేర్చని హామీలపై నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి కేంద్ర ప్రభుత్వం విద్యుత్ చార్జిలు పేరిట రాష్ట్ర ప్రజలపై రూ.8500 కోట్లు భారం మోపిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జిలు సర్దుబాటు చేస్తే అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు బాదుడే బాదుడు అంటూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేశారన్నారు. మరి నేడు సీఎంగా ఉండి ఆయన విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు ఏం సమాధానం చెబుతారన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేర్చుతారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి కుంబోయిన కన్నబాబు, గిరిజన సంఘం నాయకులు వి.రాము, వార్డు మెంబర్ నాగరాజు పాల్గొన్నారు.

ఛిద్రమైన కల్వర్ట్ రక్షణ గోడలు



ఆర్.వై.అగ్రహారం-ఉగ్గినవలస కెనాల్ మార్గంలో ఛిద్రమైన కల్వర్టు రక్షణ గోడలు

కె.కోటపాడు : రైవాడ కెనాల్ మార్గంపై పలు గ్రామాల వద్ద గల కల్వర్ట్‌ల రక్షణగోడలు ఛిద్రమవుతున్నాయి. కెనాల్ మార్గానికి ఇరువైపులా గల గ్రామాల ప్రజలు కల్వర్ట్‌ల దారిలో రాకపోకలను సాగిస్తుంటారు. సుమారు 18 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టులు ఇపుడు బలహీనం అయ్యాయి. రక్షణ గోడలు లేక ఈ కల్వర్టుల మీదుగా ప్రయాణించే వారు పలువురు అదుపు తప్పి కెనాల్‌లో పడిన సందర్భాలు ఉన్నాయి. జీవీఎంసీ అధికారులు కొరువాడ, ఆర్.వై.అగ్రహారం, డి.అగ్రహారం గ్రామాల వద్ద గల కెనాల్ మార్గంలో ఛిద్రమైన కల్వర్ట్‌లకు మరమ్మతు పనులు నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ వేడుకలు



గ్యార్వీ షరీఫ్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

నర్సీపట్నం : స్థానిక జామియా మసీదు ఆధ్వర్యంలో షాదీఖానాలో గ్యార్వీ షరీఫ్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉర్దూ, తెలుగు బయాన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన హాఫీజ్ అంజార్ ఆలమ్, హాఫీజ్ షేక్ అన్సార్ ఆలీ రజా, హాఫీజ్ షేక్ అబ్దుల్లా ఉర్దు, తెలుగు బయాన్ విశిష్టత గురించి వివరించారు. ఈ వేడుకలకు నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుంచి ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ముస్లింలు విందును స్వీకరించారు.